# ఎండమావులు




—వేదుల మీనాక్షీ దేవి

"జగమే మాయా బ్రతుకే మాయా—వేదాలలో సారమింతేనయా" త్రాగుబోతుల నేషనల్ ఆంథమ్ వినబడి తన క్లినిక్ దగ్గర రిక్షా దిగబోతున్న డాక్టర్ మధుసూదనం వెనక్కి చూశాడు.

"మూర్తీ! నువ్వా?"

"నేను గాకపోతే ను వ్వనుకున్నావా? హ్హ హ్హ హ్హ—వెర్రివాడిలాగా ఏమిటా ప్రశ్న?"

ముద్దగా వస్తున్నాయి మాటలు.

అతడు మత్తులో ఉన్న విషయం గ్రహించాడు మధుసూదనం. ప్రాణ స్నేహితుని కూడా గుర్తు పట్టలేక పోతున్నాడు మూర్తి. అతని చెయ్యి పట్టుకుని గబగబా లోపలికి తీసుకుని వెళ్ళాడు, ఆతను రానని మొరాయిస్తున్నా.

ఎంత మంచి వాడు ఇంతగా దిగజారి పోయాడు! నిర్విణ్ణుడయ్యాడు డాక్టర్ మధుసూదనం.

గది శుభ్రం చేసి, గుడ్డతో కుర్చీలు తుడుస్తున్నాడు బోయ్.

"ఐస్ వాటర్ పట్రా" అన్నాడు ఆ కుర్రవానితో.

మూర్తి ముఖంమీద చల్లని నీళ్ళు జల్లాడు. తువ్వాలుతో తుడిచాడు. బలవంతాన చల్లని నీళ్ళు త్రాగించాడు.

దానితో మూర్తి కొంత తేరుకున్నాడు. గట్టిగా తల విదిలించి, అటు ఇటు చూశాడు ఆ ప్రదేశం కొత్తగా అనిపించింది.

"మూర్తీ!" ఆప్యాయంగా పిలిచాడు మధుసూదనం. "ఎవరు?" తనని పలకరించిన వ్యక్తి వైపు చూశాడు మూర్తి. ఎదురుగా కన్నీళ్ళతో తన స్నేహితుడు. మధు! తనను చూసుకున్నాడు. ఒళ్ళంతా చెమటతో దుమ్ము కొట్టి నట్లున్నాడు. మిత్రుణ్ణి చూడటానికి సిగ్గు పడ్డట్టుగా తల వంచుకున్నాడు మూర్తి.

"మూర్తీ! ఏమిటీ దౌర్భాగ్యపు అలవాటు?" అడిగాడు మధు.

"ఇదే నా సమస్యల నుండి మళ్ళించి తాత్కాలికమైన ఆనందాన్నిచ్చి, సర్వం మరిపింప చేస్తోంది. ఏం చెయ్యమంటావు చెప్పు?" అన్నాడు మూర్తి.

ఆరని మత్తు వదిలిపోయింది.

"ఏమిటీ వాలకం? లోతుకు పోయిన కళ్ళు. ఎండిన చెక్కిళ్ళు. మాసిన గడ్డం. వసివిపోయిన వలువు తిరిగిన చాయ. అద్దంలో ఒక మారు

# సాహసికి రాష్ట్రపతి పతకం



**ఉయ్యూరులో** ఎన్నికల వాతావరణం వేడెక్కిన సమయ మది. మారణాయుధాలు ధరించి, రెండు వర్గాలవారు అటూ ఇటూ యుద్ధ సన్నద్ధులై నిలచారు. ఘర్షణ మొదలైతే ఎందరు నేల కూలుతారో వూహించలేమన్నంత ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది.

ఇంతలో కొద్ది మంది బలగంతో ఉభయుల మధ్యన వచ్చాడొక పోలీసు అధికారి. తన కేమవుతుందో అతడు ఆలోచించలేదు. ఘర్షణను నివారించడమే ఏకైక లక్ష్యంగా రంగంలోకి దిగాడు. ఉభయుల్నీ శాంతింపజేయడానికి ప్రయత్నించాడు. కాని, ఆవేశాలు చల్లారేలా కనిపించలేదు. హెచ్చరికలు చేశాడు. అవి పని చేయలేదు. గాలిలోకి తుపాకి పేల్చి, గంభీర స్వరంతో చెదరిపొమ్మని శాసించాడు. అతడి సాహసానికి ఆశ్చర్యపోయిన రెండు ముఠాలవారూ ఎటువారటు తప్పుకున్నారు. రక్తపాతం తప్పిపోయింది.

తన ప్రాణాలకు తెగించి పరుల ప్రాణాలను కాపాడిన ఆ పోలీసు అధికారి శ్రీ మారెళ్ళ వేంకటేశ్వర రెడ్డి—యాంటీకరప్షన్ బ్యూరో ఇన్‌స్పెక్టర్.

శాంతిభద్రతల యంత్రాంగంతో ప్రత్యక్ష సంబంధం లేకపోయినప్పటికీ ఎన్నికలలో బందోబస్తు డ్యూటీ చేయవలసివచ్చి, సాహసం ప్రదర్శించిన శ్రీ రెడ్డికి ఈ సంఘటన రాష్ట్రపతి పోలీసు పతకాన్ని సంపాదించి పెట్టింది.

రాష్ట్రపతి పతకాన్ని పొందడం శ్రీ రెడ్డికి మొదటి అనుభవం కాదు. ఉత్తమోత్తమంగా విధి నిర్వహణ చేసినందుకు మూడేళ్ళ క్రితం కూడా ఆయనకు రాష్ట్రపతి పోలీసు పతకం లభించింది.

శ్రీ వేంకటేశ్వరరెడ్డికి ఎమ్. ఎ., ఎల్. ఎల్. బి. డిగ్రీలు ఉన్నాయి. స్థానిక స్వపరిపాలనలో డిప్లొమా ఉంది. రిక్రూట్ అయిన కొత్తలో సబ్ ఇన్‌స్పెక్టర్‌గా శిక్షణ పొందుతూ ఒక పతకాన్ని, డిటెక్టివ్ ట్రెయినింగ్‌లో శిక్షణ పొందుతూ మరొక పతకాన్ని పొందారు. సి. బి. ఐ. శిక్షణలోనూ, సివిల్ డిఫెన్స్ ట్రెయినింగ్‌లోనూ అందరిలోకి ప్రథమ స్థానాన్ని సంపాదించుకొన్నారు.

ఆయన వయస్సు 46 సంవత్సరాలు. *

---

చూసుకొ. ఎలాగ ఉన్నావో'' అన్నాడు మధు.

''నా బ్రతుక్కి అద్దం చూసుకొడం ఒక్కటే తరవాయి, మధూ!'' కన్నీరు గోట చిమ్ముతూ అన్నాడు మూర్తి.

''ఈ అలవాటువల్ల ఆరోగ్యం దెబ్బ తింటుంది. నీ భార్యా, బిడ్డలకు దీని వల్ల తీరని అపకారం జరుగుతుంది. నీవు ఆరోగ్యంగా ఉంటేనే కదా వారికి ఆనందం? నీ తోడిదే వారి బ్రతుకు.''

''ఆ సంగతి నాకు తెలుసు. ఏ భోగ భాగ్యాలూ వద్దు. ఆశించడమూ లేదు. కాని, భార్యా బిడ్డలకు తిండి, బట్ట వంటి కనీసావసరాలైనా తీర్చలేక పోతున్నాను, మధూ! వచ్చే రెండు వందలు జీతం తప్ప మరో ఆధారం లేదని నీకు తెలుసు. అయిదారేళ్ళ క్రితం ఇంతకన్నా తక్కువ జీతంతో సుఖంగా గడిచిపోయేది. నమ్ము. నమ్మకపో... మంచి కూరతో మా కుటుంబం కడుపు నిండా భోజనం చేసి ఎన్నాళ్ళయిందో తెలుసా? 'పిల్లల పోషణ — బలవర్ధకాహారం ఇవ్వాలి' అంటూ రేడియోలో చెబుతూంటారు. పిల్లలకు పాలు గాని, పళ్ళు గాని లేవు సరికదా. అన్నంలోకి పప్పు, నెయ్యీ ఉంటే కదా బలం. అవి కళ్ళచూసి ఎన్నాళ్ళయిందో పిల్లలు'' అన్నాడు మూర్తి.

ఆవేదనతో కూడిన మూర్తి మాటలు డాక్టర్ మధు హృదయాన్ని పిండుతున్నట్లనిపించింది వింటూంటే. ఎలాగ అయినా అతనికి ధైర్యం చెప్పాలి. అతని బ్రతుకు సరియైన మార్గాన పడేలాగ చూడ్డం మిత్రుడైన తన కర్తవ్యం అనుకున్నాడు మధు.

''మూర్తీ... నీ భార్య సుశీల ఉత్తమురాలు. నీ పిల్లలు ముగ్గురూ ఆణిముత్యాలు. ఎంతో బుద్ధిగా ఉంటారు. ఇది నువ్వు గర్వించతగ్గ విషయం. ప్రతి చిన్న విషయాన్ని పెద్దగా సృష్టించుకుని బాధపడ్డం మానాలి'' అన్నాడు మధు.

''చెప్పినంత సులువు కాదు పరిస్థితుల నెదుర్కోడం. తాబేలు నడక వంటి జీతంతో కుందేలు పరుగులాంటి ధరలను అందుకోలేకపోతున్నాను. చిరిగిన చీరతో నా భార్య నా కళ్ళ యెదుట తిరుగుతుంటే చూస్తూ కూడా ఒక కొత్త చీర కొని ఇవ్వలేని నా బ్రతుకు వల్ల ప్రయోజనం ఏముందంటావు? ఎంత తక్కువ రకం చీర అయినా ముప్పయి రూపాయలలోపున లేదు. అయిదు రూపాయల లోపున జాకెట్టు గుడ్డ లేదు! పిల్లల బట్టలూ అలాగే ఉన్నాయి. వాళ్ళకి ఏమీ చెయ్యలేక, చావలేక బ్రతుకుతూ, అనుక్షణం మానసికంగా చస్తూ బ్రతుకు వెళ్ళదీస్తున్నాను, మధూ! ఈ పేద బ్రతుకులోని అనుభవాల వేదనలతో తల పండిపోయింది. మనసు కుళ్ళిపోతోంది. నవ్వడం అనేదే మరచిపోయాను''అన్నాడు మూర్తి.

వర్షిస్తున్న అతని కళ్ళు తుడిచాడు మధు.

తన కళ్ళు ఒత్తుకున్నాడు.

''మూర్తీ! నేను సైకియాట్రిస్ట్‌ నన్న సంగతి నీకు తెలుసు. నీ మనస్సుకి శాంతి లభించే మార్గం నేను చెబుతాను. లోకంలో మహా మహా కష్టాలు వస్తేనే క్రమంగా సర్దుకుని మామూలుగా బ్రతుకుతున్నారు, ఆ కష్టాలు వచ్చిన వారు. నీది ఒక సమస్య కాదనుకున్ననాడు, నీకన్న తక్కువ జీతంలో బ్రతుకుతున్న వాళ్ళతో నిన్ను పోల్చిననాడు నీ బ్రతుకే నయం అనిపిస్తుంది. మనశ్శాంతి లభిస్తుంది. ఆర్థికంగా నా సహకారం నీ కెప్పుడూ ఉంటుంది'' అన్నాడు మధు, మిత్రుని కళ్ళలోకి చూస్తూ ఆవేదనగా.

''ఇప్పటికే నీ కెంతో ఋణపడి ఉన్నాను. ఇంకా నన్ను ఋణగ్రస్తుణ్ణి చెయ్యకు. తీర్చే మార్గం లేదని నీకు తెలుసు'' అన్నాడు మూర్తి.

''అదే వద్దంటున్నాను. బొత్తిగా నిరాశావాదిగా తయారయావు. అది మంచిది కాదు. నీ కొక చిన్న సలహా చెబుతాను వింటావా?'' అన్నాడు మధు.

ఒక్క క్షణం మూర్తి కళ్ళలో చిన్న ఆశాకిరణం మెరిసి మాయమైంది.

మూర్తి మెదడుని డీ సెన్సిటైజు అంటే మొద్దుబారేటట్లు చేయాలి. షాక్ ట్రీట్‌మెంటు వంటిది ఇవ్వాలి. కొత్త ప్రాబ్లెం సృష్టిస్తే ఆలోచనల నుండి అతని దృష్టి మళ్ళించవచ్చు. వూహాలోకాల్లో విహరింప చెయ్యాలి. క్రమంగా అందువల్ల అతని మనస్సులో మార్పు వచ్చి, శాంతి లభించవచ్చు అన్న నిర్ణయానికి వచ్చాడు మధు.

''మూర్తీ! నీకు లాటరీలో లక్ష రూపాయలు వచ్చాయనుకో. లేదా... దూరపు బంధువుల బాపతు ఆస్తి వారసత్వంగా నీకు వచ్చిందనుకో. ఆ సొమ్ము యెలాగ ఖర్చు చేస్తావు? నీ మనస్సు దాని విషయంలో లగ్నం చెయ్యి. ఆ ఆలోచనలకు కాలంలో సగంభాగం కంట్రాక్టు ఇచ్చెయ్యి. మన పరిస్థితులకు అనువుగా మనలను మలుచుకోవాలి. అంతేగాని, మనకోసం పరిస్థితులు మారవు'' అన్నాడు సైకియాట్రిస్ట్ మధు.

''మధూ! నీ మాటలు వింటుంటే బాగానే ఉన్నాయి కాని, నిజజీవితంలో నావంటి నిర్భాగ్యులకు అయాచితంగా డబ్బు రావడం, జరగడం కల్ల. అటువంటివి కథలలోను, సినిమాలలోనూ జరుగుతాయి.'' నిర్లిప్తతగా అన్నాడు మూర్తి.

''చివరికాలంలో విక్రమదేవ వర్మ గారికి జమీందారీ వచ్చింది. ఆ సంగతి అందరికీ తెలుసు. ఏమో. ఏం చెప్పం? రోజులు కలిసి వచ్చిననాడు పొందరానిదంటూ ఉండదు. ఏవిధమైన సందేహాలూ మనస్సులో పెట్టుకోకు. సంసారం నీ భార్య దిద్దుకుంటుంది. జీతం ఆవిడకి ఇచ్చెయ్యి. నీకు రాబోయే ధనం గురించి ఏవిధంగా ప్లాను వేసుకోవాలో, ఏవిధంగా ఖర్చుచెయ్యాలో, జాగ్రత్త తీసుకోవాలో ఆలోచించుకుంటూ ఉండు. మరెన్నడూ త్రాగనని నాకు మాట ఇవ్వాలి'' అని చెయ్యి చాచాడు మధు.

"తప్పకుండా నీ సలహా పాటిస్తాను. ఇక తాగను" అని చేతిలో చెయ్యి వేశాడు మూర్తి.

* * *

ఉహూ. అలాగ కాదు. నా పేరుతో గనక లక్ష రూపాయలు వస్తే ఇన్‌కమ్‌టాక్స్ వాళ్ళు వెంటపడి ఏ పది వేలో గుంజి మరీ వదిలిపెడతారు. నయా పైస కూడా వాళ్ళకి వదలడానికి వీల్లేదు. అందుకు ఉపాయం ఆలోచించాలి. ఆ! అయిడియా వచ్చింది. మారు పేరుతో దూరం వూళ్ళో ఎడ్రసు ఇవ్వడం. అక్కడ ఆ డబ్బు పుచ్చుకుని చల్లగా ఇక్కడికి జారుకోడం. ఎవ్వరూ నన్ను కనుక్కోలేరు. ఇది లాటరీలో అయితేనే. వారసత్వం బాపతు అయితే మారుపేరు పెట్టుకుందుకు వీలు లేదు. ఆ వచ్చేది కూడా రాదు. బాబోయ్.

లాటరీలో ఆ డబ్బు వచ్చింది అనుకుందాం. ఇంత సొమ్ము వచ్చినట్లు ఎవ్వరికీ తెలియనియ్యకూడదు ఆఖరికి ఇంట్లో సుశీలకు కూడాను. ఏమో. ఏం చెప్పం. ఆనందం కొద్దీ ఏ ఇరుగమ్మతోనైనా నోరు జారితే ఇంకేమైనా ఉందా? కొంప మునుగుతుంది. ఇంత కట్టుదిట్టంగా ఇన్‌కమ్‌టాక్స్ వాళ్ళ కళ్ళు కప్పడానికి చేసిన ప్రయత్నం బైట పడిపోతుంది. అంతతో ఆగదు. చేతులకు సంకెళ్ళు. కటకటాల మధ్య బ్రతుకు ఖాయం. కనక, సుశీలకు కూడా తెలియనియ్యకూడదు. పెదవి దాటితే పృధివి దాటుతుందంటారు. ఆడదాని నోట్లో మాట నువ్వు గింజ నానినంత సేపైనా ఆగదంటారు కూడాను.

మూర్తి ఆలోచనలకు అంతరాయం కలిగింది.

"ఇదిగో. కాఫీ తాగండి. పంచదార తక్కువైంది. అక్కడికీ డబ్బా దులిపి వేశాను" అంటూ కాఫీ గ్లాసు చేతికిచ్చింది సుశీల.

"పంచదార తక్కువైందని అంత సంజాయిషీ ఎందుకు? కొనుక్కుందాంలే" అన్నాడు అనునయ పూర్వకంగా మూర్తి.

ఖాళీ గ్లాసు తీసుకుని ఆమె వెళ్ళిపోయింది. మూర్తి మళ్ళీ ఆలోచనా స్రవంతిలో మునిగిపోయాడు.

ఇప్పుడున్న ఇంట్లో పదేళ్ళ నుంచీ ఉంటున్నాడు తను. నెలకు ముప్పయి రూపాయలు అద్దె పోస్తున్నాడు. వాన వస్తే వీధికి, ఇంటికీ తేడా లేదు. ఇంక ఈ కొంప వదిలే రోజు వచ్చింది. మంచి ఇంట్లోకి మారవచ్చు. అన్నట్టు అద్దె ఇల్లు ఖర్మం ఏమిటి? స్వంతానికి ఇల్లే కొనుక్కోవచ్చు. ఆ మధ్య చిలక జోస్యం వాడు చెప్పాడు—'ఇల్లు కట్టనైనా కడతావు. కొననైనా కొంటా'వని. నెల నెలా అద్దె ఇవ్వడానికే కటకట లాడుతున్న నాకు ఇల్లు ఒకటా? అని నమ్మలేదు వాడి మాటలు. వాడి జోస్యం నిజమే అన్నమాట! బాగానే ఉంది కాని, ఆ ప్రయత్నం ఇప్పుడు చేస్తే. వీడికి డబ్బెక్కడిది? అని లోకం విడ్డూరంతో గుసగుసలు పోదూ? తన ఎక్సరే కళ్ళతో లోపలి భావాలను కనిపెట్టెయ్యరూ? 'భావమున జీర్ణమయ్యే సుభాషితమ్ము' అన్నట్టు ఇంటి ఆలోచన మనస్సులోనే జీర్ణమైపోవాలా! కొంత కాలం ప్రచ్ఛన్నంగా బ్రతుకు వెళ్ళదీస్తూ క్రమంగా అనుకున్న పనులు నెరవేర్చుకోవాలి. ప్లాన్ వేసుకోవడంవల్ల ప్రమాదం లేదు కదా. ఇల్లు కొనడం. అంతే కాదు. గాడ్రెజి బీరువాలు, సోఫాసెట్లు, రేడియో, ఫాన్ కొనాలి. పాపం. సుశీల కష్టంతో వంట చేస్తూ పొగతో బాధ పడుతోంది. గాస్ స్టౌ కొనాలి. మంచి చీరలు, నగలు కొనాలి. పిల్లలకు మంచి బట్టలు కొనాలి. కొత్త పుస్తకాలు కొనాలి. పాపం ఎప్పుడూ వాళ్ళకి సెకండ్ హాండ్‌వే అవుతున్నాయి. అన్నట్లు వాళ్ళ చదువులకు కొంత సొమ్ము కేటాయించాలి. వాళ్ళ భవిష్యత్‌కి బంగారు బాట వెయ్యాలి. నా బిడ్డల్ని నాలాగ పేద బ్రతుకు బ్రతకనియ్యను అనుకున్నాడు మూర్తి.

ఈ విధంగా తన ప్లాన్‌లు ఒక కొలిక్కి రావడంతో కొంత తృప్తి పడ్డాడు.

"మీరు ఇన్‌స్టిట్యూట్‌కి వెళ్ళే వేళ అవుతోంది" అంటూ సుశీల వచ్చింది.

"ఇదేమిటి ఇందాకటి నుండీ వ్రాస్తున్నారు! పనేమైనా ఎక్కువగా ఉందా? వాళ్ళు కడిగి కడిగి ఇచ్చే రెండు వందల రూపాయలకు ఇంత పనా? ఖర్మ. లేవండి. స్నానం చేసి, భోజనం చేద్దురు గాని" అంది.

తన ఆలోచనలకు ఫుల్‌స్టాప్ పెట్టి లేచాడు మూర్తి.

భోజనానికి కూర్చున్న మూర్తి అన్నంలో వేలుతో అంకెలు వేస్తున్నాడు.

"అయ్యో..ఆ పరధ్యాసం యేమిటండీ. ఇదేం అబ్బాయి అక్షరాభ్యాసం


పాఠశాలల్లో/కళాశాలల్లో సీటు దొరకలేదని చదువు మానము కదా!

మీ పిల్లలు కాలము వృధా చేయకుండా కావలసిన తరగతులు
ఎస్.ఎస్.సి కాని, 7వ తరగతి కాని, ఇంటర్మీడియట్ కాని కాలేజీలో చదువుతూ,
ప్రత్యే శిక్షణకొరకైననూ లేక ప్రైవేటుగా పరీక్షకు కూర్చొనుటకైననూ కావలసిన శిక్షణకు
క్రమశిక్షణాయుక్తమగు శిక్షణకొరకు
'నిస్వార్థసేవయే పరమార్థము'గా పేరుపొందిన

**ఎస్. ఎస్. ఆర్. బాలికల విద్యాకేంద్రములో**

ప్రవేశములు జరుగుచున్నవి.

**'STICH IN TIME SAVES NINE'**
**'IDLE PERSON'S BRAIN IS A DEVIL'S WORK SHOP'**

అన్న వేదవాక్కులు మరచిపోకండి.
గడిచిపోయిన కాలం తిరిగిరాదు — విచారించి లాభం లేదు రానున్న మంచి సమయం
దుర్వినియోగం కాకుండ త్వరపడుట సమంజసము.

**మీ భవిష్యత్తు సరిదిద్దుకొనుటకు కావలసిన సరియైన సలహాలకు డైరెక్టరుతో సంప్రదించండి.**

ఫోను పి. పి. 56526; బ్యాంకు వీధి, హైదరాబాదు-1.

గుర్తుంచుకోండి!

**ఎస్. ఎస్. ఆర్. ట్యుటోరియల్ కాలేజ్**

మా అనుబంధ విద్యాసంస్థ.
మాకు వేరే బ్రాంచీలు లేవు.

అనుకున్నారా? అదైనా బియ్యంలోనే వ్రాస్తారు కాని, అన్నంలో కాదు'' అంది సుశీల. ఆమె మనస్సేమిటో, శంకిస్తున్నది.

''ఆ! నేను వ్రాస్తున్నానా! లేదే!'' అంటూ గబగబా భోజనం ముగించాడు మూర్తి.

అప్పుడప్పుడు డాక్టర్ మధు వచ్చి చూచి వెడుతున్నాడు.

• • • •

''మేనేజరుగారు మిమ్మల్ని పిలుస్తున్నా రండి.''

''అయ్యా! మిమ్మల్నే'' అన్న హెచ్చరికతో వూహా లోకాన్నుండి ప్రకృతిలోకి వచ్చాడు మూర్తి.

''నన్నా?''

''అవునండి! అర్జంటుగా రమ్మంటున్నారు'' అన్నాడు ప్యూన్.

మూర్తిని చూస్తూనే మేనేజరు ముఖం అతి గంభీరమైంది.

''మిస్టర్ మూర్తీ! ఏమిటీ గీతలు, అంకెలు ఫైళ్ళ నిండా? ఫైళ్ళలోని విషయాలకు సంబంధించిన వేనా ఇవి?'' అని నాలుగు ఫైళ్ళు మూర్తి వైపు తోశాడు మేనేజరు.

మేనేజరు చెప్పిన మాటలు నిజమే. ...న్ని గీతలు, అంకెలు తన భవిష్యత్తు ...చిన ప్లానులు, లెక్కలు.

...ందుకు సమాధానం ఏమిటి?'' ...డు మేనేజరు.

...్తి స్తంభించి పోయాడు. ఏమని ...ు చెప్పడం? ఉన్న విషయం ...్ష లక్ష వస్తుందన్న విషయం ...ుంది కదా? చాలా ప్రమాదం. ...న్హించుకుని బయట పడాలి ...ు మూర్తి.

''ఒంట్లో బాగా లేక ఏదో పొరపాటు జరిగిపోయింది, సార్!'' అన్నాడు మూర్తి.

''ఇది ఫస్ట్ వార్నింగ్. ఇక అలాటివి మళ్ళీ జరిగితే ఉద్యోగానికి నీళ్ళు వదులుకోవలసిందే'' అని గట్టిగా హెచ్చరించి మరీ వదిలాడు మేనేజరు.

'హు. ఇతడికి జీతపు రాళ్ళు తప్ప గతిలేదు. లక్షాధికారి నైన నన్నెన్ని మాట లన్నాడు. కలలోకూడా నా అంత వాడు కాలేడు తను' అని ఇవతలకు వచ్చి నవ్వుకున్నాడు మూర్తి.

కథల్లో లాగ, సినిమాల్లో లాగ నిజ జీవితాలలో కాలం గడవడం సులభం కాదు. దినదిన గండంగా వెళ్ళ మారుతున్నాయి రోజులు సుశీలకు. సంసారంలో ఆర్థికంగా చిక్కు లేదుల్నోంటూంది. మూర్తి ఏమీ పట్టించుకోవడం లేదు. పైగా అతని పరిస్థితి అంతకంతకు అధ్వాన్నమై పోతూంది. రాత్రింబగళ్ళు ఆ ఇన్స్టిట్యూట్ పనితో అతని మెదడు బండ బార పోతూందో, ఏమో ఖర్మం అంటూ బాధ పడుతూంది సుశీల.

మూర్తి కుటుంబ బాధ్యతను పూర్తిగా విస్మరించాడు.

• • • •

రాత్రి పది గంటలైంది. మూర్తి ఇంకా ఇంటికి రాలేదు. పిల్లల్ని నిద్ర పుచ్చి, వాళ్ళ పక్కనే ఒరిగింది. ఆమె మనస్సు పరిపరి విధాల పోతూంది.

టాణాలో పన్నెండు కొట్టారు.

వీధి తలుపు చప్పుడైంది.

ఉలిక్కిపడి లేచింది సుశీల.

''ఎవరు వారు''' అంది గట్టిగా.

''నేనే. సు...శీ..లా!''

కిటికీలోంచి తొంగి చూసింది. ఆ కంటస్వరం గుర్తు పట్టలే నంతగా ఉంది.

ఆమె అనుమానం తొలగి పోయింది. వీధి గుమ్మం వద్ద తన భర్త. నిలబడ లేనంతగా కదిలి పోతున్నాడు.

గబగబా వెళ్ళి తలుపు తీసింది.

తూలుతూ లోపలికి వచ్చాడు మూర్తి! గుప్పున వాసన! సుశీల ప్రాణాలు పైనే పోయాయి.

''ఇంతసేపు ఎక్కడ ఉన్నారు? ఏమి టీ వాలకం?'' అంటున్న సుశీల ప్రశ్నలకు జవాబు లేదు.

భుజాలు పట్టుకుని కుదిపింది.

భార్యకేసి ఎవరో కొత్త వ్యక్తిని చూసినట్లు చూశాడు.

''ఏమిటండి అలాగ చూస్తున్నారు. నేను... సుశీలనండీ... ఏమి టీ వాసన?'' గాభరా పడిపోతుంది ఆమె.

''ఉష్... గోల చెయ్యకు... ఇవాళ జీతం వచ్చింది కదూ. గొప్పవాళ్ళు బార్‌లకి వెళ్ళాలి... ఫారన్ సరుకు పుచ్చుకోవాలి. ఇది ఇప్పటి సంఘంలో నాగరికత. నీకేం తెలియదు. మనం గొప్ప వాళ్ళం అని తెలియకూడదు. అందు చేత నాటు సారా ఒక్క గుక్క పుచ్చుకున్నాను. మధుకి తెలిస్తే కోప్పడ తాడు. గొడవచెయ్యకు'' అంటున్నాడు మధ్య మధ్య ముద్దమాటతో.

''ఈ బుద్ధి మీ కెలాగ పుట్టిందండీ.. మన ఇంటా వంటా లేదు. ఇక ఎప్పుడూ తాగనని నా మీద ప్రమాణం చెయ్యండి.'' అని చెయ్యి చాచింది సుశీల, వెక్కి వెక్కి ఏడుస్తూ.

ఆమె మాటలు, ఏడుపు అతని కెంతవరకు అగతమయాయో ఆ దైవానికే ఎరుక... కాని, చేతిలో మాత్రం అతని చెయ్యి ఉంది...

''ఇంటద్దె, పాలవాడికి, పని మనిషికి, చాకలికి డబ్బివ్వాలి. నాలుగవ తారీఖు కూడా వచ్చింది'' అంది సుశీల పై సంఘటన జరిగిన మూడు రోజులకు.

''మన బీరువాలో నోట్ల కట్ట ఉంది చూడు. అందులో నీకు కావలసిన డబ్బు తీసుకో..'' వ్రాసుకుంటున్న మూర్తి తల ఎత్తి అన్నాడు.

''ఏ బీరువా! మనకి బీరువాయే లేదు కదా!'' అంది.

''బీరువా లేకపోవడం ఏమిటి?మామూలుది కాదు. గాడ్రెజు బీరువా...మేడ మీద ఉంది గదిలో'' అన్నాడు మూర్తి.

ఆమె వంక పరిశీలనగా చూశాడు.

''నీ చీరకు ఎన్ని చిరుగులున్నాయో చూసుకున్నావా? సరే... సాయంత్రం నేను కంపెనీ నుండి వచ్చేటప్పటికి సిద్ధంగా ఉండు.. నీకు, పిల్లలకి బట్టలు కొంటాను.'' అన్నాడు మూర్తి.

మళ్ళీ వ్రాసుకోడంలో మునిగి పోయాడు మూర్తి. అతని మాటలకు నవ్వాలో, ఏడవాలో తెలియడం లే దామెకు. కూలడానికి సిద్ధంగా ఉన్న పాత కొంపలో అద్దెకు ఉంటున్న తమకు మేడ ఏమిటి! గాడ్రెజు బీరువా ఏమిటి! ఒక్కచీరటరు కొత్త బట్ట తెచ్చి ఎంత కాలమైందో... అటువంటిది అందరికీ బట్టలు కొంటాననడం ఏమిటి? భగవాన్... ఏమి టీ గందరగోళం?

నిలబడలేక గబగబా వంటింట్లోకి వెళ్ళి చతికిలబడింది.

''నాన్నా! రెండు దస్తాల తెల్ల కాగితాల పుస్తకాలు కొనుక్కోమన్నారు మేస్టారు. లెక్కలకి కావాలట. స్కూల్ స్టోర్స్‌లోకి తెలుగు, ఇంగ్లీషు, సైన్సు పుస్తకాలు వచ్చాయట'' అన్నాడు పదేళ్ళ పిల్లవాడు.

''వీధి గది అలమారులో కీమసు కాగితాలున్నాయి. మన గుమాస్తాగారి చేత కుట్టించుకో. మీ అమ్మ నడిగి డబ్బు తీసుకుని పుస్తకాలు కొనుక్కో.''

''గుమాస్తా ఎవరు, నాన్నా?'' పిల్లవాని అమాయకపు ప్రశ్న.

''ఛీ... వెధవా... నోర్మూయ్. చెబితే అర్థం కాదా. అధిక ప్రసంగం చెయ్యక వెళ్ళు.'' తండ్రి కసురులు.



తండ్రీ, కొడుకుల సంభాషణ వినబడుతూంది సుశీలకు. ఇక తను ఏడుస్తూ కూర్చుంటే లాభం లేదు. జరగవలసిన పనిని చూడాలి. అతని ప్రవర్తన వింతగా మారిపోతుంది. సరిగా నిద్రలేదు. తిండి తినడంలేదు. ఏదో మార్గం చూడాలి... అనుకుంది సుశీల.

పెద్ద పిల్లవాడిని డాక్టర్ మధుసూదనం గారింటికి పంపింది. ఆయన పొరుగూరు వెళ్ళారనీ, సాయంత్రానికి వస్తారనీ, రాగానే పంపుతాననీ ఆయన భార్య కబురంపింది సుశీలకు.

సాయంత్రం ఆరు గంటలైంది.

శీతాకాలం అవడం వల్ల ఆరు గంటలకే చీకటి పడింది. ఊరి నుండి వచ్చిన మధుసూదనం—భార్య చెప్పిన కబురు విని కాళ్ళయినా కడుక్కో కుండా, కాఫీ చుక్కైనా గొంతులో పోసుకోకుండా వచ్చినవాడు వచ్చినట్లే బైలు దేరాడు రిక్షాలో.

మెయిన్ రోడ్డు మలుపు తిరిగిన రిక్షా—గుమిగూడిన జనంతో దారి బంద్ కావడంతో ఆగిపోవలసి వచ్చింది.

"ఏక్సిడెంట్" అనుకుంటున్నారు జనం.

"ఏదీ నన్ను చూడనియ్యండి" అని గుంపుని తప్పించుకుని పడిపోయి ఉన్న వ్యక్తిని సమీపించాడు డాక్టర్ మధు.

నాడి చూశాడు. అతి నీరసంగా.. ఉందా లేదా? అన్నంతగా కొట్టుకుంటోంది.

వీధి దీపాలు వెలగడం లేదు. చిమ్మ చీకటిగా ఉంది ఆ ప్రదేశం. జేబులోంచి టార్చి తీశాడు ఆ వ్యక్తిని పరీక్షించడానికి. ముఖం మీద లైటువేసిన మధుసూదనంకి "మూర్తీ!" అంటూ గుండెలు అవిసేలాగ, దిక్కులు పిక్కటిల్లేటట్లు, అక్కడి జనం అదిరిపోయే మోస్తరుగా ఒక్క బొబ్బ పెట్టి ఆ వ్యక్తి ప్రక్కనే చతికిలబడ్డాడు.

"తలవంచుకు నడుస్తున్న ఈ బాబును రాసుకుంటూ పోయింది లారీ. ఆ విసురుకి పడిపోయాడు' అన్నారొకరు ఆ గుంపులోంచి.

మధు కర్తవ్యతా శూన్యుడైనాడు. రక్తం మడుగులో అతి దీనంగా పడి ఉన్న మూర్తి వంక తదేకంగా చూస్తూ కుమిలి కుమిలి ఏడుస్తున్నాడు.

సైకియాట్రిస్ట్‌గా తను నేర్చిన మనస్తత్వ శాస్త్ర పరిజ్ఞానాన్ని ఉపయోగించి తన మిత్రుణ్ణి బాగుచెయ్యాలనీ, ఆ సంసారంలో ఆనందోత్సాహాలు వెల్లివిరియాలనీ, ఆ కుటుంబం శ్రేయస్సునాకాంక్షించే తను అనుకున్నాడు. ఆర్థిక విషయాల నుండి మిత్రుని మనస్సు మళ్ళిస్తే బాగుపడతాడనీ గంపెడంతాశతో ఆశయంతో చెప్పిన సలహా ఈ విధంగా వక్రిస్తుందనీ, విధి అతనితో, అతని కుటుంబంతో ఆటలాడుతుందనీ కలలో కూడా తలచనైనా లేదు తను.

ఎండమావుల వంటిది అతని లాటరీ డబ్బు. ఎండమావుల్లో నీళ్ళున్నవని పాంథులు భ్రమిస్తారు. అలాగే తన సలహాను త్రికరణశుద్ధిగా నమ్మి లాటరీ సొమ్ము రావడం నిజమే అన్న భ్రమలో పడిపోయాడు. ఇంతగా మమైకమైపోతాడని తను సలహా ఇచ్చినప్పుడూహించలేదు. కొంత ఆలోచనలో మార్పు వస్తుందనుకున్నాడంతే. తను ఆశించినట్లు తని మనస్సుకి పూరట కలగలేదు. మనస్సుకి మార్పు క్రిందరాలేదు.

తను సలహా ఇచ్చి ఉండకపోతే ఏ కష్టమో, నిష్ఠూరమో వాళ్ళ బ్రతుకు వాళ్ళు బ్రదికేవారేమో. విషంలో పురుగు విషంలో బ్రతికినట్లు ఎటువంటి పరిస్థితు లేర్పడినా ఆ క్లిష్ట పరిస్థితులకు అలవాటు పడిపోతారు లోకంలో. తను చేతులారా ఆ కుటుంబానికి ఘోరమైన అపరాధం చేశాడు. తను పాపాత్ముడు. తన పాపానికి నిష్కృతి లేదు. అనుకుంటూ పరిపరివిధాల బాధ పడుతూ, మిత్రుని తల తన ఒడిలో పెట్టుకున్నాడు మధు.

"మూర్తీ! నావైపు చూడవూ. నేను మధుని. కళ్ళు తెరు" అంటూ తల, ముఖం నిమురుతూ రోదిస్తున్నాడు సైకియాట్రిస్ట్ మధు.

మూర్తి మెల్లిగా కళ్ళు తెరిచాడు. మిత్రుని వంక చూశాడు లిప్తకాలం. అతని పెదవులు కదిలాయి.

"లక్ష రూపాయలు సు...శీ...ల... పి...ల్ల...లు..." అన్న మాటలు అస్పష్టంగా వినబడ్డాయి మధుకి.

మూర్తి కళ్ళు మూతలు బడ్డాయి.







**Printed and Published on behalf of Andhra Prabha Private Ltd. by A. S. DEVITRE, at the Dinamani Press, Express Estate, Madras-600 002. Editor: POTTURI VENKATESWARA RAO.**